క్లుప్తంగా

అసంఘటిత కార్మికులు లేబర్‌కార్డు పొందాలి



లేబర్ కార్డుదారులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కుల్కచర్ల: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ లేబర్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని జన్‌సహాస్ స్వచ్ఛంద సంస్థ నియోజకవర్గ కోఆర్డినేటర్ రవీంద్ర సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అసంఘటిత కార్మికులు తప్పనిసరిగా లేబర్‌కార్డు పొందాలన్నారు. తద్వారా ఉచితంగా వైద్య చికిత్స పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మొత్కూరు వెంకటేశ్, హెల్త్ క్యాంపు కోఆర్డినేటర్ విష్ణువర్ధన్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ చలాన్లు చెల్లించండి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

తాండూరు టౌన్: వాహనాల పెండింగ్ చలాన్లు చెల్లించాలని పట్టణ సీఐ సంతోష్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పలు వాహనాలను నిలిపి పత్రాలు, చలాన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. చలాన్లు చెల్లించేందుకు ప్రభుత్వం భారీ రాయితీ సౌకర్యం కల్పించిందని, దానిని సద్వినియోగం చేసుకుని, ఈ నెల 15వ తేదీ లోగా చెల్లించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధలను వాహనదారులు పాటించాలని, దీనివలన చలానాలు విధించడం కానీ, రోడ్డు ప్రమాదాలు జరగడం కాని ఉండవు.

గ్రామ స్వచ్ఛతే లక్ష్యం



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న కార్మికులు, గ్రామస్తులు

కుల్కచర్ల: గ్రామాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని ఎంపీఓ ఖరీం అన్నారు. ఆదివారం మండల పరిధి ముజాహిద్‌పూర్ గ్రామంలో ట్యాంక్ క్లీనింగ్, పిచ్చిమొక్కల తొలగింపు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తామని, అందులో భాగంగా మురుగుకాల్వలను శుభ్రం చేయడం, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేస్తామని వెల్లడించారు. ప్రజలందరూ తమవంతుగా స్వచ్ఛత పాటించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని సన్మానిస్తున్న కౌన్సిలర్ శ్రీలత తదితరులు

తాండూరు టౌన్: వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ కౌన్సిలర్ సాహు శ్రీలత ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని కోరారు. ఆదివారం తుల్జాభవాని ఆలయంలో క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యేకు వార్డు సమస్యలను వివరించారు. 24వ వార్డు అభివృద్ధికి నోచుకోవడం లేదని, తుల్జా భవాని ఆలయానికి వెళ్లే రోడ్డు ఆక్రమణకు గురైందని పేర్కొన్నారు. బాలాజీనగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ లేనికారణంగా.. పక్కనే ఉన్న శివాలయ మ్యూజియం చుట్టూ మురుగునీరు చేరిందని చెప్పారు. త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని కౌన్సిలర్ కోరారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

తాండూరు రూరల్: మండల పరిధి అంతారం గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతల సహాయంతో ఆదివారం భూమిపూజ చేశారు. గుడి నిర్మాణానికి సుందరి అంజిల్‌రెడ్డి అనే వ్యక్తి రూ.10 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లాలప్ప, చంద్రప్ప, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీను, ఎంపీటీసీ శాంతు, మాజీ సర్పంచ్ శేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?



గూడూరు–శివారెడ్డిపల్లి రోడ్డు దుస్థితి

- అధ్వానంగా గూడూర్–శివారెడ్డిపల్లి రహదారి
- గుంతలు, కంకర తేలి రూపం కోల్పోయిన వైనం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

దోమ: ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా గ్రామీణ ప్రాంత రహదారులు దుస్థితి మారడం లేదు. మండల పరిధి గూడూరు నుంచి శివారెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన మెటల్ రోడ్డు పూర్తిగా కంకరతేలి అధ్వానంగా ఉంది. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. బీటీరోడ్డు కోసం స్థానికులు ఏళ్లతరబడి ఎదురు చూస్తున్నా.. ఫలితం లేకుండా పోయింది.

పెరిగిన దూరభారం

గూడూరు, శివారెడ్డిపల్లి మీదుగా ఆయా గ్రామాల ప్రజలు పరిగి పట్టణం, దోమ మండల కేంద్రానికి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో అనేక ఇక్కట్లు పడుతున్నారు. సాధారణ పరిస్థితుల్లో ఎలా ఉన్నా.. అత్యవసర సమయాన ప్రాణాల మీద ఆశ వదులుకోవాల్సిందేనంటూ ఆవేదన చెందుతున్నారు. గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు, ఎవరైనా అనారోగ్యం పాలైతే వైద్య చికిత్సల కోసం పట్టణ కేంద్రాలకు, ఇతర ప్రాంతాలకు ఈ మార్గం గుండా తీసుకెళ్లలేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. రోడ్డు బాగలేని కారణంగా.. అత్యవసర సమయంలో పట్టణ ప్రాంతాలకు వెళ్లాలంటే సుమారు 14 కిలో మీటర్ల మేర తిరిగి వెళ్లాల్సి వస్తోందని ప్రజలు తెలిపారు. ఇదే విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

చర్యలు చేపట్టాలి

శివారెడ్డిపల్లి–గూడూరు వెళ్లే ప్రధాన మెటల్ రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు దుస్థితి గురించి అధికారులు, పాలకులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. రోడ్డు పూర్తిగా కంకర తెలి, గుంతలుగా ఉండటంతో ఈ మార్గంలో పయనించలేని పరిస్థితి. వాహనంపై కాదుకదా.. కనీసం కాలినడకనా వెళ్లడం కష్టమే. అధికారుల స్పందించి, బీటీరోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలి.

– అర్జున్ రెడ్డి, శివారెడ్డిపల్లి గ్రామం

రైతులను మోసం చేసిన ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: కృష్ణా జలాలను ప్రభుత్వం.. ఆంధ్రకు అప్పజెప్పుతుంటే.. బీఆర్‌ఎస్ ఊరుకోదని, ప్రజలపక్షాన నిలబడుతుందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఆయన నివాసంలో చలో నల్లగొండ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే తెలంగాణ రైతులను మోసం చేసిందన్నారు. కృష్ణా జలాల వాటాపై బీఆర్‌ఎస్ చేస్తున్న యుద్ధంలో ప్రతి కార్యకర్త పాల్గొనాలని, అందులో భాగంగా రేపు (13న) నల్లగొండలో నిర్వహించే బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, రవికుమార్ పాల్గొన్నారు.

అయోధ్యకు బయల్దేరిన భక్తులు



అయోధ్యకు వెళ్తున్న బీజేపీ శ్రేణులు

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల నుంచి బీజేపీ శ్రేణులు, హిందూ ఉత్సవ కమిటీల నేతలు రామమందిరాన్ని దర్శించుకునేందుకు అయోధ్యకు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు మాట్లాడారు. హిందూ ప్రజల కల సాకారమైన వేళ ప్రజలు రామమందిరాన్ని దర్శించుకునేందుకు ఆసక్తి కనబర్చుతున్నట్లు తెలిపారు. హిందువులు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, బీసీమోర్చా మండల అధ్యక్షుడు గుడాల వెంకటయ్య, చౌడాపూర్ మండల అధ్యక్షుడు బందయ్య తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



అమ్మవారి సన్నిధిలో భక్తులు

కొడంగల్ రూరల్: నగరేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామివారికి పంచామృతంతో అభిషేకం, విశేష అలంకరణ, నైవేద్యాలను సమర్పించి, మంగళహారతులు పట్టారు. అనంతరం అమ్మవారికి అభిషేకం, విశేష అలంకరణ చేశారు. ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన చేశారు. మహా మంగళహారతులు అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కటుకం శివకుమార్ గుప్తా, కొడంగల్ అధ్యక్షుడు ఆకుల ప్రవీణ్‌కుమార్, మహిళా సంఘం అధ్యక్షురాలు స్వప్న, వాసవి క్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్, కార్యదర్శి నందారం రాము, కోశాధికారి మెతుకు సాయి కిషోర్, సభ్యులు కొత్త ఎల్లయ్య, పూరి శేఖర్, చిదిరి వీరేష్, ఆంజనేయులు, పట్నం మనోజ్‌కుమార్, సవిత, మమత తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌కు మహర్దశ

- జీటీరోడ్ల నిర్మాణానికి రూ.213కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తంచేసిన కాంగ్రెస్ నాయకులు, ప్రజలు



హర్షం వ్యక్తంచేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజవర్గం కొడంగల్‌కు మహర్దశ పట్టింది. రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం చొరవ చూపడంతో ప్రజలు హర్షం వ్యక్తచేస్తున్నారు. ఈ నిర్ణయంతో మారుమూల ప్రాంతాలకు సైతం బీటీరోడ్లు వేయనుండటంతో రవాణా సౌకర్యం మెరుగు పడనున్నట్లు స్థానికులు చెప్పారు. సెగ్మెంట్ పరిధి దుద్యాల, బొంరాస్‌పేట మండలాలతో పాటు మిగతా ఆరు మండలాలకు బీటీరోడ్లు మంజూరయినట్లు కాంగ్రెస్ పార్టీ ఇరు మండలాల అధ్యక్షులు ఆవుటి శేఖరయ్య, నర్సింహులుగౌడ్‌లు తెలిపారు. రెండు మండలాల్లో బీటీరోడ్ల నిర్మాణం చేపట్టేందుకు రూ.38కోట్ల 61లక్షల 70వేల నిధులు మంజూరయినట్లు వారు పేర్కొన్నారు. దుద్యాల మండలం సంద్రకుంటతండా రోడ్డు, మండల కేంద్రం నుంచి అల్లిఖాన్‌పల్లి మీదుగా కోస్గి మండలం నాచారం వరకు, ఎక్కచెరువుతండాకు బీటీరోడ్లు మంజూరయ్యాయి. బొంరాస్‌పేట మెట్లకుంట, లోతికుంటతండా, గుబ్బడితండా రోడ్లు బీటీగా మారనున్నట్లు నాయకులు వెల్లడించారు.

మొత్తం రూ.213కోట్లు

నియోజకవర్గ పరిధి 8 మండలాల్లో రోడ్ల నిర్మాణాలకు రూ.213కోట్ల 20లక్షల 70వేల నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. బీటీల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. రహదారుల సుందరీకరణతో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని స్థానికులు చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు రాజేశ్‌రెడ్డి, వెంకటయ్య, అంజిల్‌రెడ్డి, మల్లికార్జున్, సంతోష్‌కుమార్, ఖాజా తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఛత్రపతి శివాజీ ఆదర్శపాలకుడు

మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



శివాజీ విగ్రహావిష్కరణలో కరవాలంతో రోహిత్‌రెడ్డి

బషీరాబాద్: ఛత్రపతి శివాజీ మహారాజ్ గొప్ప పరిపాలన దక్షుడని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన బషీరాబాద్ మండలం నీళ్లపల్లి, గ్యాగఖుర్దు, కంసాన్‌పల్లి గ్రామాల్లో శివాజీ విగ్రహాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఛత్రపతి అడుగుజాడల్లో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరివైపే మొగ్గు

- బియ్యం ధరలు పెరగడమే కారణం
- ముమ్మరంగా యాసంగి పనులు
- ఆలస్యమైనా కరిగెట్లు చేసి నాట్లు వేస్తున్న రైతులు



ట్రాక్టర్‌తో కరిగెటు చేస్తున్న రైతులు

> యాసంగిలో వరిసాగుపై ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు విధించకపోవడంతో అన్నదాతలు వరి సాగుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. మండల వ్యాప్తంగా నీటి వనరులు సమృద్ధిగా ఉండడంతో పాటు, భూగర్భ నీటి మట్టాలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో అన్నదాతలు ముందడుగు వేస్తున్నారు. వానాకాలం సీజన్‌లో వడ్లకు మద్దతు ధర లభించింది. దీనికి తోడు ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం ధరలు పెరిగాయి. దీంతో ఆలస్యమైనా యాసంగిలో వరిని సాగుచేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు.

మొయినాబాద్: వరిసాగుపై రైతుల్లో ఆసక్తి పెరిగింది. యాసంగిలో చాలా మంది రైతులు వరి సాగుపైనే దృష్టి పెట్టారు. ఆలస్యమైనా కరిగెట్లు చేసి, నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. హైదరాబాద్ మహానగరానికి చేరువలో ఉన్న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో.. చాలా మంది రైతులు పూలు, కూరగాయలతో పాటు వరి సాగు చేస్తారు. సాధారణంగా యాసంగిలో మాత్రం ఎక్కువ మంది పూలు, కూరగాయలపైనే దృష్టి పెడతారు. కానీ ఈ సారి చాలా మంది అన్నదాతలు వరి సాగుపై దృష్టి సారించారు. యాసంగి వరి సాగు డిసెంబర్, జనవరి నెలల్లోనే చేస్తారు. డిసెంబర్ మొదటి వారం నుంచి నార్లు పోసి, జనవరి మొదటి వారం నుంచి నాట్లు వేస్తారు. కానీ ఈ సారి ఫిబ్రవరి రెండో వారం వచ్చినా ఇంకా చాలా మంది రైతులు కరిగెట్లు చేస్తున్నారు. నాట్లు వేసేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. మండలంలోని చిలుకూరు, చందానగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, చిన్నమంగళారం, మేడిపల్లి, ఎలుకగూడ, పెద్దమంగళారం, అప్పారెడ్డిగూడ, చిన్నషాపూర్, తోలుకట్ట, ఎత్‌బార్‌పల్లి, నక్కలపల్లి, కేతిరెడ్డిపల్లి, కనకమామిడి, వెంకటాపూర్, సురంగల్, శ్రీరాంనగర్, అమ్డాపూర్, బాకారం, నాగిరెడ్డిగూడలో వరి నాట్లు జోరుగా వేస్తున్నారు.

బియ్యం ధరలకు రెక్కలు

ఈ సారి బియ్యం ధరలు అమాంతం పెరిగాయి. వానాకాలంలో వరి పండించిన రైతులు, బియ్యాన్ని రూ.5,500 నుంచి 6,500 వరకు విక్రయించారు. గతేడాది బియ్యం ధరలు రూ.3,000–3,500 వరకు మాత్రమే ఉన్నాయి. ఈ సారి బియ్యం ధరలు పెరగడంతో రైతులు వరి వేసేందుకు సిద్ధమవుతున్నారు. వానాకాలంలో వరిసాగు చేసిన రైతులు యాసంగిలో మళ్లీ వరినాట్లే వేస్తున్నారు. మండలంలో ఇప్పటికే సుమారు 1,500 ఎకరాల్లో వరి సాగు అయింది. మరో వెయ్యి ఎకరాలకు పైగా సాగు అయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

వరిసాగే లాభసాటి



భూగర్భజలాలు పెరిగి బోరుబావుల్లో నీళ్లు ఉండటంతో వరి పంట సాగుచేయడమే లాభసాటిగా ఉంది. ఈ సారి ధాన్యం, బియ్యం ధరలు పెరిగాయి. వానాకాలంలో వరిసాగు చేశాను. బియ్యం పట్టించి విక్రయించాను. బియ్యం ధర క్వింటాలు రూ.5,000 పైగా విక్రయించాను. అందుకే యాసంగిలోనూ రెండెకరాలు వరిసాగు చేశాను.

– వర్లూరి శ్రీనివాస్, రైతు, అప్పారెడ్డిగూడ

దిగుబడి తగ్గుతుంది



రెండేళ్లుగా యాసంగిలో వరిసాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ సారి కూడా చాలా మంది వరినాట్లు వేస్తున్నారు. ఇప్పటికే మండలంలో 1,500 ఎకరాల్లో వరిసాగు అయింది. ఫిబ్రవరి 15లోపే నాట్లు పూర్తి కావాలి. ఆలస్యంగా వేస్తే దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. వరి కోత సమయంలో అకాల వర్షాలు, వడగళ్లు పడే అవకాశం ఉంది.

– రాగమ్మ, మండల వ్యవసాయాధికారి, మొయినాబాద్

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లయన్స్‌క్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ సభ్యులు తెలిపారు. కంటిలో పొరలు(శుక్లాలు) వచ్చిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య చికిత్సకు వచ్చేవారు తమవెంట ఓటరు గుర్తింపు, రేషన్ కార్డుల్లో ఏదైనా ఒకటి జిరాక్స్ కాపీ తీసుకురావాలని సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్‌తో పాటు మందులు అందజేస్తామని, అలాగే రవాణా ఖర్చులు ఇస్తామని తెలిపారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



గర్భగుడిలో కొలువైన అమ్మవారు

అనంతగిరి: వాసవి కన్యకాపరమేశ్వరి మాతా ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం రామ మందిరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన మంగళహారతి కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాలె లక్ష్మణ్‌గుప్తా, పలువురు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి..



అహ్మద్ ఖాన్

అనంతగిరి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన తనకు న్యాయం చేయాలని బాధితుడు ఎండీ అహ్మద్ ఖాన్ కోరారు. ఈ నెల 5న వికారాబాద్‌లో కందులు విక్రయించి, రాత్రి 6.45గంటల సమయంలో తిరిగి బైక్‌పై స్వగ్రామం చన్‌గోముల్‌కు వెళ్తున్న క్రమంలో.. డెంటల్ కళాశాల సమీపంలో వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టిందని, ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయని బాధితుడి తెలిపారు. ఈ సంఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని అహ్మద్ కోరాడు.

ప్రవర్తన మార్చుకొని, హాయిగా జీవించండి



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న ఎస్‌ఐ విఠల్‌రెడ్డి

తాండూరు రూరల్: ప్రవర్తన మార్చుకొని, మంచిగా మారి, హాయిగా జీవించండి అని ఎస్‌ఐ విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. ఇక నుంచి ఎలాంటి వివాదాల్లో తలదూర్చొద్దని హెచ్చరించారు. పూర్తిగా మారిన తర్వాతే రౌడీషీట్ తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎంపీడీఓ బదిలీ

తాండూరు రూరల్: తాండూరు ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి నల్లగొండ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆదివారం ఉన్నతాధికారులు ఉత్తర్వుల జారీ చేశారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



సర్టిఫికెట్స్ అందజేస్తున్న కృష్ణంరాజు

కొడంగల్: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు అన్నారు. కరాటేలో శిక్షణ పొందిన 40 మంది విద్యార్థులకు ఆదివారం మెరిట్, శిక్షణా ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు, క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ వెంకటయ్య పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళి



దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్: పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయకు బీజేపీ నేతలు ఘనంగా నివాళి అర్పించారు. పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీకి పునాదులు వేసిన మహనీయుడు పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ అని కొనియాడారు. జాతీయ వాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అలుపెరుగని కృషి చేసిన దార్శనికుడు దీన్‌దయాళ్ అని అన్నారు. ఒకే దేశం, ఒకే రాజ్యాంగం ఒకే జెండా అని దేశంలోని ప్రజలను ఒకే తాటిపైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారని గుర్తుచేశారు. ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. నాయకులు నర్సింహులు, హరిభూషణ్, శ్యాంసుందర్, శివకుమార్, రాజు, విజయ్ ఉన్నారు.

'గృహజ్యోతి'తో పేదలకు ఊరట



అర్హుల నుంచి వివరాలు సేకరిస్తున్న చంద్రశేఖర్, నరేందర్‌నాయక్

షాబాద్: గృహజ్యోతి పథకంతో పేదలకు ఊరట లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో గృహజ్యోతి పథకానికి సంబంధించిన వివరాలను విద్యుత్‌శాఖ ఏఈ నాగేందర్‌నాయక్ తన సిబ్బందితో వినియోగదారుల నుంచి సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్ వివరాలు సిబ్బందికి అందజేయాలని సూచించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో వినియోగదారుల వివరాల సేకరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, రవి, వెంకట్‌రెడ్డి, గోపాల్, రామకృష్ణ, శంకర్, భిక్షపతి, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పర్యాటకులు లేక నిలిచిన బోట్లు

బోసిపోయిన కోట్‌పల్లి

ధారూరు: ఆదివారం వచ్చిందంటే.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు కోట్‌పల్లి ప్రాజెక్టుకు పోటెత్తేవారు. కానీ నిన్న సందర్శకుల తాకిడి తగ్గుముఖం పట్టడంతో జలాశయం బోసిపోయింది. దీంతో పడవలో ప్రయాణించే వారు లేక.. బోట్లు నిలిచిపోయాయి. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో సందర్శకులు అంతంత మాత్రంగానే వచ్చినట్లు బోటింగ్ నిర్వాహకులు, దుకాణదారులు వెల్లడించారు.